క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలకు పూర్వ విద్యార్థి వితరణ


ఎస్.వి.సాయి ప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్.వి.సాయిప్రసాద్ కళాశాలకు రూ.లక్ష వితరణగా అందజేశారు. ఈయన 1982–85 మధ్య డిగ్రీ బీఎస్సీ పూర్తిచేసి, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులో ఎండోమెంట్ డిపాజిట్ చేసి.. తద్వారా వచ్చిన వడ్డీతో ప్రతి సంవత్సరం కళాశాల వార్షికోత్సవం నాడు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి తన తండ్రి జ్ఞాపకార్థం 'సాకూరు వెంకట రమణ మెమోరియల్' పేరిట అవార్డుగా నగదు బహుమతిని అందజేయాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ బుధవారం వెల్లడించారు.

ఖోఖో క్రీడాకారిణులకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: ఇటీవల పల్నాడు జిల్లా కారంపూడిలో రాష్ట్రస్థాయి ఖోఖో స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు జరిగాయి. జిల్లా జట్టు తరఫున కొచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కె.విమల, జె.భవానీ పాల్గొన్నారు. జిల్లా ఖోఖో జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారిణులను హెచ్ఎం కిల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు పైల సత్య, ఎంవీ రమణ బుధవారం అభినందించారు.

ధాన్యాన్ని కాపాడుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రమణారావు

గార: వరి పంట కోతలు పూర్తవుతున్న తరుణంలో తుఫాన్ కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని, ధాన్యం తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ ఎస్.రమణారావు రైతులకు సూచించారు. బుధవారం పూసర్లపాడు పరిధిలోని పొలంలో రైతులకు అవగాహన కల్పించారు. కోతలు పూర్తయితే కుప్పలు పెట్టుకోవాలని, ధాన్యం సిద్ధమైతే తడిచిపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు ముగిశాకే కోతలు ప్రారంభించాలన్నారు.

డెలివరీ బాయ్‌కు సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న పెద్దపాడు యువత

శ్రీకాకుళం కల్చరల్: మండలంలోని కిల్లిపాలెం గ్రామానికి చెందిన ఆన్‌లైన్ స్టోర్స్ డెలివరీ బాయ్ అలబాన చిన్నారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్యం కోసం రూ.15లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో పెద్దపాడుకు చెందిన యువత ముందుకొచ్చి తమవంతు సాయంగా రూ.20వేలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలోబొట్టా శంకర్, బోర చిన్నారావు, కోరాడ సీతారాం, ఆవల ఢిల్లీ, కె.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత


సామగ్రి అందిస్తున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: మండలంలోని సంతవురిటిలో ఈ నెల 23న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, కంచరాన రమణరావు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు ఆదేశం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ నిర్మాణ పనులకు సంబంధించి నిధులు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినట్లు ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదల వలస చిరంజీవి చెప్పారు. ఫరీదుపేటలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ మజ్జి విజయ్ కుమార్ తరఫున కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. బిల్లులు నెల రోజుల్లో చెల్లించాలని అధికార యంత్రాంగానికి కోర్టు ఆదేశించినట్లు తెలిపారు.

'ఇనాం' సమస్యకు.. మోక్షమెప్పుడో?


సేతుభీమవరంలో ఇనాం భూములు ఇవే


భూముల్లో పండిస్తున్న వరి పంట

- సేతువరంలో భూ హక్కు కోసం రైతుల ఎదురుచూపులు
- ఈ–క్రాప్ నమోదు కాక పథకాలకు దూరమవుతున్న వైనం

జి.సిగడాం: మండలంలోని సేతు భీమవరంలో ఇనాం భూముల సమస్యకు మోక్షం కలగడం లేదు. భూములపై హక్కు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఈ–క్రాప్ నమోదు చేయడానికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు, పథకాలకు దూరమవుతున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవడం, కష్టాకాలంలో భూ విక్రయాలు చేయాలంటే రైతు పేరిట ఒన్–బి రాకపోవడం తదితర సమస్యలు స్థానిక రైతులను వెంటాడుతున్నాయి. ఇక్కడ సుమారు 800 ఎకరాల్లో ఇనాం భూములు ఉన్నాయి. వందేళ్లకు పైగా గ్రామ రైతులే సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అప్పట్లో రాజులకు కొంత మొత్తంలో శిస్తు రూపంలో చెల్లించేవారు. రాజుల హయాం ముగిసిన తర్వాత శిస్తు వసూళ్లకు ఎవ్వరూ రావడంలేదు. ఇదే సమయంలో భూములపై హక్కులు కూడా రాలేదు. ఈ విషయమై గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులకు, తహశీల్దార్లకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందిస్తున్నా ఫలితం దక్కడం లేదు. ఈ భూములపై ఆధారపడి సుమారు 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. భూములు సాగు చేస్తున్నా పాసు పుస్తకాలు లేక, ఆన్‌లైన్‌లో ఒన్–బీ రాకపోవడంతో బ్యాంకులు రుణాలను మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

భూహక్కు లేదు..



మా తాత ముత్తాతల కాలం నుంచి రాజులు ఇచ్చిన ఇనాం భూములను సాగు చేస్తున్నాం. అయినా భూహక్కు కలగడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం

– పైల ఆదినారాయణ, రైతు, సేతు భీమవరం

ఇబ్బందిపడుతున్నాం..



ఇనాం భూములన్నీ గ్రామస్తులంతా సాగు చేస్తున్నాం. పండించిన పంట ప్రభుత్వానికి అమ్ముదామంటే ఆన్‌లైన్‌లో ఒన్–బి రావడం లేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– కుదిరెళ్ల అప్పారావు, రైతు, సేతు భీమవరం

శిస్తులు కట్టారు..



గతంలో మా పెద్దలు రాజులకు శిస్తు కట్టేవారు. తర్వాత శిస్తు కోసం ఎవరూ మా గ్రామానికి రాలేదు. దీంతో భూహక్కు లేక ఇనాం భూముల సమస్య అలాగే మిగిలిపోయింది.

– పోగతోక రాంబాబు, రైతు, సేతు భీమవరం,

ప్రభుత్వం చొరవతీసుకోవాలి



ఇనాం భూముల సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో రైతులు, ఇనాందారులతో అప్పటి అధికారులు చర్చించారు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా దృష్టి పెట్టాలి

– కుదిరెళ్ల సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు సేతుభీమవరం

ఉన్నతాధికారులకు దృష్టికి..



మా గ్రామంలో సుమారు 300 కుటుంబాలు ఇనాం భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇనాందారుల మధ్య ఒప్పందం కుదిరింది. ఎన్నికల కోడ్ రావడంతో సమస్య పరిష్కారం కాలేదు.

– తొత్తడి రామారావు, సర్పంచ్, సేతు భీమవరం

ఉమారుద్రుడికి మహా హారతి



నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామికి కార్తీక మాసం బుధవారం సందర్భంగా మహా హారతి ఇచ్చారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

పోలీసుల విస్తృత తనిఖీలు



ఎస్సై వి.సందీప్‌కుమార్ నేతృత్వంలో ఎచ్చెర్ల పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎచ్చెర్ల, చిలకపాలేం, కుశాలపురం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో దుకాణాలు, వాహనాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ కట్టడిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్సై చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

బాల్య వివాహాలను అరికడదాం



బాల్యవివాహాలను నిర్మూలించడంలో స్వయం సహాయ సంఘాలతో పాటు ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఐసీడీఎస్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, బెడ్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా మేనేజర్ మజ్జి సింహాచలం, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం అర్బన్

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాయికుమార్


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుండ హరేష్

రణస్థలం/శ్రీకాకుళం రూరల్: రణస్థలం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, శ్రీకాకుళం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుండ హరేష్ బుధవారం విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని వివరించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు


బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోలకు సంబంధించిన రెండు సూపర్‌లగ్జరీ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు, ఒక పల్లెవెలుగు బస్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు త్వరలో 42 కొత్త బస్సులు రానున్నాయని, తొలివిడతలో 25 బస్సులు వచ్చాయన్నారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనుందని చెప్పారు. డీపీటీవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం నడుపుతున్న ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ అధికారులు ఎండీపీ బాషా, ప్రసాద్, ఎంపీ రావు, ఆర్టీసీ పీఆర్‌వో కె.సుమన్, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, యూనియన్ నాయకులు, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ముప్పు


అవగాహన కల్పిస్తున్న ఎస్సై లక్ష్మణరావు

ఎచ్చెర్ల: ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని లావేరు ఎస్సై లక్ష్మణరావు అన్నారు. లావేరు మండలం లింగాలవలసలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

జి.సిగడాం: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్యపైనే దృష్టి సారించాలని ఎస్ఐ వై.మధుసూదనరావు యువతకు సూచించారు. బుధవారం తన స్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలికలను ఇబ్బందులు పెట్టే ఆకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గార: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్ధన సూచించారు. బుధవారం బూరవెల్లి పంచాయతీలో సంకల్పం పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, అమ్మకాలు, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు గానీ, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు గానీ తెలియజేయాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ


ఎచ్చెర్ల: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్


జి.సిగడాం: ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: లావేరు మండలం సిగిరికొత్తపల్లికి చెందిన డ్రైవర్ పొన్నాడ చిన్నారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మీసాల రమణ, లుకలాపు అనికల్‌కుమార్, మంత్రి శ్రీనివాసరావు ఉన్నారు.

జి.సిగడాం: ఎంపీపీ మీసాల వెంకటరమణ తల్లి ఆదిలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాలి రమేష్, భూపతి సురేష్‌కుమార్, తొత్తడి రామారావు, మామిడి శ్రీనివాసరావు, వడిశ మహేశ్వరరావు, ఏర్నేన ప్రకాశరావు, నల్లి తవిటినాయుడు, బత్తుల వెంకట కృష్ణారావు, డాక్టర్ రాంబాబు, అక్కలనాయుడు, గోవిందరావు, అప్పలసూరి, మక్క సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జి.సిగడాం: మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మీసాల సత్యవతి అన్నారు. బుధవారం డాక్టర్ బుడుబూరు యశ్వంత్ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు ప్రత్యేక వసతి, ఫ్యాన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాయల రమణ, ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీఓ గుంటుకు రామకృష్ణారావు, వైద్యులు పేకల సుమబిందు, సభ్యులు పున్నాన అక్కలనాయుడు, సీహెచ్ఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి


బాతువలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

జి.సిగడాం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. బుధవారం బాతువ, డి.ఆర్.వలస, ఎందువ, జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధనకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు అరసాడ రవి, ముళ్లు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు దుర్గాభవాని, నర్సింహుంమూర్తి, కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: మరుగుదొడ్ల వినియోగంతోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీరాములు అన్నారు. పాఠశాలలో తాగునీటి విభాగం ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే నష్టాలు, మరుగుదొడ్ల వినియోగం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భ ంగా హెచ్ఎం మాట్లాడుతూ వ్యక్తిగత, గ్రామ పారిశుద్ధ్యం మెరుగుకు విద్యార్థులు కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ అమ్మాజి, కోఆర్డినేటర్లు మురళీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కమ్యుటేషన్ రికవరీ ఉత్తర్వులు అమలు చేయాలి


ట్రెజరీ డీడీని కలిసిన సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల (పింఛన్‌దారులు) కమ్యుటేషన్ రికవరీకి సంబంధించిన ఉత్తర్వులు ఖజానా శాఖకు చేరినందున వెంటనే ఆ ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ బుధవారం రిటైర్డు ఉద్యోగులు సంఘం ప్రతినిధులు ఖజానా శాఖ డీడీ రవికుమార్‌కి ఆయన చాంబర్‌లో కలిసిన వినతి పత్రాన్ని అందజేశారు. కమ్యుటేషన్ రికవరీ 15 ఏళ్ల నుంచి 11 ఏళ్ల మూడు నెలల కాలం లోపునే రికవరీ చేయాలన్న ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. డీడీని కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, సిటీ బ్రాంచి అధ్యక్షులు ఆజానకిరాం పట్నాయక్, కోశాధికారి రామమోహనరావు, కార్యవర్గ సభ్యులు ఝాన్సీరాణి, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రామేశ్వర్, మోహనరావు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

అరసవల్లి : జిల్లాలో అన్ని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలను అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, కేంద్రప్రభుత్వ 'ప్రసాద్' పథకాన్ని అరసవల్లి ఆలయానికి అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని తెలిపారు. రథసప్తమి ఉత్సవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పండుగగా గుర్తించారని చెప్పారు. దేవాలయ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అరసవల్లి ఈవో వై.భద్రాజి, జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, శ్రీకూర్మం ఈవో గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం చేయాలి


ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 4జీ/5జీ సర్వీసులు వేగవంతం చేయాలని సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ధర్నాలో భాగంగా శ్రీకాకుళం సంచారభవన్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి 1 నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతనసవరణ, పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ అమలు చేయాలన్నారు. ధర్నాలో ఈయూ నాయకులు అభిమన్యు, లక్ష్మి, అరుణ, గోపాలరావు, పాణిగ్రాహి, చరణ్, డి.శ్రీనివాసరావు, శారద, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం


మహాకుంభాభిషేకం కోసం ఏర్పాటు చేసిన కలశాలు

శ్రీకాకుళం కల్చరల్ : స్థానిక బోడెమ్మకోవెలలో జీవేశ్వరాలయం వద్ద శివపంచాయతన సహిత రుద్రయాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బుధవారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు రంగాభట్ల శ్రీను, అనిల్‌శర్మ, కె.శ్రీను పర్యవేక్షణలో కల్యాణం జరిపించారు. 29న జరిగే మహా కుంభాభిషేకం కోసం 1100 కలశాలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో కృష్ణదాస్


కృష్ణదాస్‌ను ఆశీర్వదిస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ సతీ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మాన పద్మప్రియ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు


కుక్కల్ని పట్టుకుంటున్న కార్పొరేషన్ సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ బుధవారం తెలిపారు. వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వాక్సినేషన్ వేసినట్లు చెప్పారు. శానిటరి ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, మేస్త్రీలు, పశుసంవర్ధక అధికారి పాల్గొన్నారు.

2 నుంచి యూనిట్-4 పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో డిసెంబర్ 2వ తేదీ నుంచి యూనిట్–4 పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రోజుకు రెండు పరీక్షల చొప్పున జరగనున్నాయని ఇంటర్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ప్రిన్సిపాళ్లకు సూచించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ మోడల్‌స్కూల్ కాలేజీస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్ యాజమాన్యే జూనియర్ కాలేజీల్లో ఉదయం 11.30 నుంచి 12.30 వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు పరీక్ష పేపర్‌ను గంట చొప్పున నిర్వహించనున్నారు.